క్లుప్తంగా

విరివిగా మొక్కలు నాటండి



మొక్క నాటుతున్న ఎంపీడీఓ, పూర్వ విద్యార్థులు

తలకొండపల్లి: విరివిగా మొక్కలు నాటి పచ్చదనం వెల్లివిరిసేలా గ్రామాలను తీర్చిదిద్దాలని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని చంద్రధనలో 1996–97లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సుమారు రూ.20 వేలు విలువ చేసే మొక్కలను పూర్వ విద్యార్థులు సమకూర్చారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓతో పాటు, ఎంపీఓ రఘు హాజరై, పూర్వ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కుమార్, రాములు, సుభాష్, రాజేందర్‌రెడ్డి, రాఘవేందర్, పూర్వ విద్యార్థులు రమేష్, శివాజీ, మల్లేష్, నరసింహ, కృష్ణవేణి, రవీందర్‌రెడ్డి, రాజు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ఆమనగల్లు: గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఆమనగల్లు ఎంపీడీఓ కుసుమ మాధురిని కోరారు. పట్టణంలో సోమవారం ఎంపీడీఓ కుసుమ మాధురిని గ్రామ పంచాయతీ కార్మికులు కలిసి తమ వేతనాలను వెంటనే అందించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

ఘనంగా వారాహిదేవి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీ దేవి

ఆమనగల్లు: పట్టణంలోని భక్తమార్కండేయ స్వామి దేవాలయంలో ఆషాఢమాసం సందర్భంగా వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేకాలంకరణ చేసి పూజలు, హోమం నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు నాగభూషణస్వామి, శరత్చంద్ర ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, స్థానికులు దాస శ్రీనివాస్, అరుణ, రచ్చ స్వరూపారాణి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల అందజేత



విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఇస్తున్న సభ్యులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి సోమవారం గ్రామ బ్లూ టీమ్ సభ్యులు పంపిణీ చేశారు. ఇదే బడిలో తాము చదువుకున్నామని ఆ జ్ఞాపకాలను నేమరుసుకుంటూ తోచిన సహాయం విద్యార్థులకు చేస్తున్నట్లు బ్లూ టీమ్ సభ్యులు మహేశ్‌మహరాజ్, శ్రీధర్, సంపత్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

'నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్చండి'

తలకొండపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్‌ను నియమించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ గౌడ సంఘం కన్వీనర్ అశోక్‌గౌడ్ కోరారు. ఆ దిశగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వం తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులను ముందుండి నడిపించిన నేత ఉప్పల వెంకటేశ్ అన్నారు. అందుకే నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆయన్ని నియమిస్తే వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని సూచించారు.

పేదల ఆశాజ్యోతి వైఎస్సార్

ఊరూరా దివంగత నేతకు నీరాజనం

- యాచారంలో ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి నివాళి



యాచారం: మంతన్‌గౌరెల్లిలో వైఎస్సార్ యాదిలో నినాదాలు చేస్తున్న కోదండరెడ్డి తదితరులు



ఆమనగల్లు: వైఎస్సార్ విగ్రహం వద్ద నాయకులు



అబ్దుల్లాపూర్‌మెట్: అనాజ్‌పూర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



తలకొండపల్లి: వైఎస్సార్ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న నాయకులు



కడ్తాల్: వైఎస్సార్ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

యాచారం: ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల ఆశాజ్యోతి అని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం మండలంలోని మంతన్‌గౌరెల్లి గ్రామంలో ఆయన చిత్రపటానికి కోదండరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిన్ను మర్చిపోలేం రాజశేఖరా.. అంటూ వైఎస్సార్‌తో తనకున్న పరిచయాలు, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉచిత విద్యుత్, ఒకేసారి వ్యవసాయ పంటల రుణమాఫీ అమలు, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, 108, ఆరోగ్యశ్రీ పథకం ఇలా ఎన్నో పథకాలను అమలు చేసి పేదలకు ఎంతో దగ్గరయ్యాడని పేర్కొన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఆయన చేసి మంచి పనులే నేటికి కాంగ్రెస్ పార్టీకి జీవంలా మారాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అరవింద్‌నాయక్, నాయకులు అఖిల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గునుగల్ గేట్ వద్ద

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గునుగల్ గేట్ వద్ద వైఎస్సార్ జయంతిని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. నక్కర్తమేడిపల్లి, మాల్, యాచారం, నస్దిక్ సింగారం, కుర్మిద్ద తదితర గ్రామాల్లో కూడ కాంగ్రెస్ శ్రేణులు వైఎస్సార్ జయంతిని నిర్వహించారు.

కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో..

ఆమనగల్లు: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో



మంచాల: వైఎస్సార్ చిత్రపటం వద్ద నేతలు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు జగన్, మానయ్య, ధనుంజయ, ఖలీల్, కృష్ణనాయక్, విజయ్, ఖాదర్, శ్రీశైలం, అలీం, సురేశ్‌నాయక్, మల్లయ్య, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, నాజర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి

ఇబ్రహీంపట్నం: వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ అన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంగయ్యగౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్సార్ పేదలకు చేసిన సేవలు ఎన్నటికి మరిచిపోలేనివన్నారు. వైఎస్సార్ ఆశయసాధనకు అభిమానులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరినారాయణజీ, నందకుమార్, జంగయ్యగౌడ్, శ్రీనివాస్, యాదగిరి, బూరాన్, మురళీ, తరుణ్‌రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మండలంలోని అనాజ్‌పూర్ గ్రామంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన నాయకులు

తలకొండపల్లి: మండలంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు జలయజ్ఞ ప్రదాత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, ప్రయాణికులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన అడుగు జాడల్లో నడిచి ఆయన ఆశయాలను అమలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భగ్‌వాన్‌రెడ్డి, రవీందర్‌యాదవ్, అంజయ్యగుప్తా, కృష్ణ, యాదగిరి, జనార్దన్, ఆరీఫ్, వెంకటేష్, అజీం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు బాణావత్ రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు గాంధీభవన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పెద్దఎత్తున పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి

కడ్తాల్: దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. వైఎస్సార్ జయంతిని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వైఎస్సార్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, బీక్యానాయక్, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, హన్మానాయక్, జాహంగీర్‌బాబా, హీరాసింగ్, జహంగీర్‌అలీ, శేఖర్‌గౌడ్, అశోక్, బాలరాజు, జవహర్, వెంకటేశ్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ఘనంగా

మంచాల: మండలంలోని పలు గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నాయకులు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున మహనీయుడిని స్మరిస్తూ వేడుకలు నిర్వహించారు.

మాజీ పాలకవర్గానికి సన్మానం

మంచాల: ఇటీవల పదవీ విరమణ పొందిన మండలంలోని ఆరుట్ల గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని సోమవారం అధికారులు సన్మానించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు శ్రీనివాస్, రమేశ్, మాజీ వార్డు సభ్యులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జంగయ్యగౌడ్, ఎంపీడీఓ బాలశంకర్, ఎంపీఓ మధుసూదన్‌చారి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, మాజీ వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ..

ఆమనగల్లు: మాడ్గుల మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న మాజీ వైస్‌ఎంపీపీ శంకర్‌నాయక్‌ను గుడితండాకు చెందిన నాయకులు సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ధనరాజ్‌నాయక్, తారాసింగ్, రాందాస్, వినోద్, కల్యాణ్, హోబా, నందు, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



మృతుడి కుటుంబానికి నగదు ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీకాంత్ కాలనీకి చెందిన మేస్త్రీ బాలస్వామి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో మృతుడి కుటుంబాన్ని సోమవారం గతంలో శివదీక్ష తీసుకున్న స్వాముల ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి రూ.40 వేలు ఆర్థికసాయం అందించారు.

పరామర్శ

తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్‌కు చెందిన వెంకటమ్మ(62) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ సోమవారం బాధిత కుటుంబానికి తలో రూ.మూడు వేల చొప్పున అందజేశారు.

కార్యకర్త కుటుంబానికి..

కడ్తాల్: మండలంలో గుర్లకుంటతండాకు చెందిన రాజునాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని సోమవారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి నాయకులతో కలిసి పరామర్శించి రూ.5 వేల నగదు అందజేశారు.

స్థిరాస్తి పేరుతో చెరువుల కబ్జా

మత్స్యకారుల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

మంచాల: కబ్జాకోరుల నుంచి చెరువులను కాపాడాలని మత్స్యకారుల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం మండంలోని ఆగాపల్లిలో నిర్వహించిన మత్స్యకారుల కార్మికుల సంఘం జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్, పట్టణీకరణ, పరిశ్రమల పేరుతో పెద్ద ఎత్తున చెరువులు కబ్జాలకు గురవుతున్నాయన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కనీసం కబ్జాలకు గురవుతున్న నీటి వనరుల వైపు చూడకపోవడం శోచనీయమన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత చేప పిల్లల పంపిణీ స్కీం కొనసాగిస్తూ, మత్స్య సొసైటీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, విష పదార్థాలు కలిసి చేపలు చనిపోతే నష్టపరిహారానికి ప్రత్యేక జీఓ తీసుకొని రావాలన్నారు. కాగజ్‌ఘట్‌లోని అల్లి చెరువు కబ్జా విషయంలో చట్ట బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు చక్రపాణి, జంగయ్య, శ్రీనివాస్, నర్సింహ, రాజు, కొండల్, రాములు, యాదయ్య, రమేష్, భాస్కర్, హన్మంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని తులేకలాన్ గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యురాలు నాగటి నాగమణి భర్త భాస్కర్ రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. విదేశాల్లో ఉన్న కుమారుడి రాక కోసం అంత్యక్రియలను తాత్కాలికంగా ఆపారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని భాస్కర్ మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణారెడ్డి, బుగ్గరాములు, యాదగిరి, చంద్రయ్య, కృపేశ్, సుకన్య, జంగమ్మ, రాంరెడ్డి, హంసమ్మ, బీరప్ప, కరుణాకర్‌రెడ్డి, మంగ, జ్యోతి, ఎంకమ్మ, రవీందర్‌రెడ్డి, సబ్‌రిజిస్ట్రార్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన కిసాన్ మోర్చా నేతలు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కిసాన్ మోర్చా నేతలు

ఇబ్రహీంపట్నం: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డికి బీజేపీ కిసాన్‌మోర్చా నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య, జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా ఎలాంటి షరతులు విధించకుండా రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని, ఖరీఫ్, రబీ సీజన్ కలిపి భరోసా పేరుతో ఎకరాకు రైతులకు రూ.15 వేలు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు విఠల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రంగారెడ్డి, శ్రీరాములు, వెంకటేశ్‌గౌడ్, కాళిదాసు, శ్రీను, పోచయ్య, శ్రీకాంత్, రాఘవేంద్ర, శ్రీశైలం, విజయ్, రూపక్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.


గిరిజనుల సంక్షేమానికి పాటు పడండి



ఎంపీ బలరాంనాయక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవీందర్‌నాయక్

ఆమనగల్లు: మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌ను సోమవారం కాంగ్రెస్ జిల్లా ఎస్టీ సెల్ నాయకుడు మేడిగడ్డ రవీందర్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో రవీందర్‌నాయక్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు రవీందర్‌నాయక్ తెలిపారు.

బెడ్ షీట్ల పంపిణీ



విద్యార్థులకు బెడ్‌షీట్స్, నోట్‌బుక్స్ అందజేస్తున్న రాములు

కడ్తాల్: మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహం, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, దుప్పట్లు, బెడ్‌షీట్స్‌ను సంక్షేమాధికారి రాములు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని విద్యార్థులకు సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

మంచాల: మండలంలోని ఆరుట్ల ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాల సమస్యలకు నిలయంగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, రాము, జంగయ్య, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు సిద్ధంగా ఉంచండి

మండల ప్రత్యేకాధికారి సుజాత



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుజాత

ఆమనగల్లు: ప్రభుత్వం చేపట్టే వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ సుజాత కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం వివిధ గ్రామాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. వన మహోత్సవం కోసం అన్ని నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మొక్కలు నాటేందుకు గ్రామాలలో ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులలో ఈజీఎస్ కూలీలచే గుంతలు తీయించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు నాటాలని కోరారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సీజనల్ వ్యాధుల అవగాహన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుజాత మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమమాధురి, ఎంపీఓ ఉమారాణి, ఈజీఎస్ ఏపీఓ మాధవరెడ్డి, ప్రభుత్వాస్పత్రి వైద్యులు మంజుల, విజయ, ఎంపీహెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ



సమావేశంలో చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, అధికారులు

తుర్కయంజాల్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులతో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ సూచించారు. సోమవారం ఆమె రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో పాలకవర్గసభ్యులు, వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విష జ్వరాలకు దోమలే ప్రధాన కారణమని, దాని నివారణకు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వ్యాధుల ప్రబలకుండా అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేలా జలమండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న పైప్‌లైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత, జలమండలి జీఎం శ్రీధర్, డీజీఎం సునీల్, మేనేజర్ వినయ్, డాక్టర్ శ్రావణ్, పుర డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ మల్లికార్జున్, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

కొందుర్గు: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని షాద్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజారత్నం అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించి పత్తి, మొక్కజొన్న, వరి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటలను కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవాలని, అవసరమైన మందులు పిచికారీ చేయాలన్నారు. రసాయనిక ఎరువులు అధికంగా వాడితే నేలలోని పోషకాలు నశించిపోతాయని, ఇందుకోసం ఎరువుల మోతాదును తగ్గించాలన్నారు. రైతులు విడిగా పంట మార్పిడి చేయాలని, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడూ తీసివేయాలన్నారు. వర్షాకాలంలో పంటపొలాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.